www.udyamakeratam.com
PRGI : TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 41 | | 18-7-2026 | | శనివారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-


## భారత రైల్వేలో నూతన శకం



- పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు
- జింద్-సోనిపట్ మార్గంలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ

4

## భారీ ఉగ్రకుట్ర భగ్నం



4


- గుజరాత్‌లో ఐదుగురు జైషె మహమ్మద్ ఉగ్రవాదుల అరెస్టు
- ఉగ్ర నెట్‌వర్క్ ఏర్పాటు యత్నం.. బాంబు తయారీ కుట్ర వెలుగులోకి
- ఉపా చట్టం కింద కేసు నమోదు.. జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీ

## 20 వరకు బతికి ఉంటా



- ఆరోగ్యం క్షీణిస్తున్న వేళ సోనమ్ వాంగ్‌చుక్ భావోద్వేగ వ్యాఖ్యలు
- 20వ రోజుకు చేరిన నిరాహార దీక్ష.. పార్లమెంట్ పాదయాత్రకు ప్రజలకు పిలుపు

4



## ప్రభుత్వ ఉద్యోగులకు
# ఆరోగ్య భరోసా

- 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
- 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం
- 886 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,816 రకాల చికిత్సలకు ఉచిత సేవలు
- సచివాలయంలో పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర రాజనర్సింహ



2

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలలో అనారోగ్య భయాలను పోగొట్టి, వారికి కొండంత అండగా నిలిచేలా రూపొందించిన 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'ను రాష్ట్ర ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి ఈ నూతన పథకాన్ని ప్రారంభించి, ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఉద్యోగులు అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చుల కోసం అప్పులపాలవుతున్న దుస్థితిని గమనించి, వారికి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీకి తానే స్వయంగా ఛైర్మన్‌గా వ్యవహరించానని, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఈ పటిష్ట విధానాన్ని రూపొందించామని వివరించారు.

- హైదరాబాద్, జూలై 17 (ఉద్యమ కెరటం)

## ధరణి అక్రమాలపై
# 'సిట్' దర్యాప్తు

### తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

- పంచాయతీల నిధులు ఇక నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకే..
- పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తికి పెద్దపీట వేస్తూ పంచాయతీరాజ్ చట్ట సవరణ
- ధరణి అక్రమ లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు, జగిత్యాల డిగ్రీ కాలేజీ పోస్టుల భర్తీకి ఆమోదముద్ర
- దేవాదుల, పాలమూరు, సీతారామ, చిన్న కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపు



2

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ధరణి ప్రారంభమైన నాటి నుంచి జరిగిన అన్ని లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు కూడా ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలతో పాటు అక్రమ మ్యుటేషన్లపై ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని నిర్ణయించింది. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- హైదరాబాద్, జూలై 17 (ఉద్యమ కెరటం)

## ఫిఫా కిక్కు!

నేడు, రేపు ఉదయం 3 గంటల వరకు బార్లు ఓపెన్

ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్

2

- ఫిఫా కీలక మ్యాచ్‌ల నేపథ్యంలో అర్ధరాత్రి దాటినా మద్యం విక్రయాలకు అనుమతి
- హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోనే వెసులుబాటు



## దేవాదాయ శాఖలో 191 మందికి ఉద్యోగాలు

- తెలంగాణ చరిత్రలో తొలిసారి భారీ స్థాయిలో మతపరమైన నియామకాలు
- రవీంద్రభారతిలో నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ

2





## బాలికపై లైంగిక దాడి

- బెదిరించి పలుమార్లు అత్యాచారం.. గర్భం దాల్చిన బాధితురాలు
- ఇద్దరు యువకులపై పోక్సో కేసు
- నిందితుల కోసం గాలింపు చేపట్టిన పోలీసులు

2

## 850 కిలోల నెయ్యి సీజ్

- రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల స్పెషల్ డ్రైవ్
- కమిషనర్ సంగీత సత్యనారాయణ వెల్లడి



3

రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి ఇతర పదార్థాలు, కొవ్వులు కలుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జూలై 14, 15 తేదీల్లో పోలీసుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ తెలిపారు. కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు గుర్తించారు.



## నేడు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ

3

సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

పోలీసుల నిరాకరణపై న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బీఆర్ఎస్

భారీగా తరలిరావాలని యువతకు పార్టీ పిలుపు

## ఆశ్రమంలో గంజాయి సాగు!

- టాస్క్‌ఫోర్స్ దాడిలో బండారం బట్టబయలు
- 25 గంజాయి మొక్కలు స్వాధీనం
- వికారాబాద్ జిల్లాలో కలకలం..

2



ఉద్యమ కెరటం
శనివారం
18 జూలై 2026

# ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

- 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
- 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం
- 886 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,816 రకాల చికిత్సలకు ఉచిత సేవలు
- సచివాలయంలో పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, జూలై 17:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సమగ్ర ఆరోగ్య భద్రత కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'ను ప్రారంభించింది. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు వైద్య ఖర్చుల కోసం అప్పులపాలయ్యే పరిస్థితిని తొలగించి, వారికి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ పథకం ద్వారా సుమారు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులు లబ్ధి పొందనున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 886 నెట్‌వర్క్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్) ప్యాకేజీ రేట్ల ప్రకారం 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలకు పూర్తిస్థాయి నగదు రహిత చికిత్స అందించనున్నట్లు వివరించారు. పథకం అమలు పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు భట్టి తెలిపారు. ఉద్యోగుల సమస్యలను అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకే ఈ పథకాన్ని రూపొందించామని చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించిన భట్టి, అప్పట్లో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తోందన్నారు. నెలకు రూ.2 వేల కోట్ల చొప్పున బిల్లులు విడుదల చేస్తున్నామని, ప్రతి 15 రోజులకు ఒకసారి స్వయంగా సమీక్ష నిర్వహిస్తూ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి 1.06 కోట్ల కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అదే స్థాయిలో ఉద్యోగులు కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని భట్టి పిలుపునిచ్చారు. రాష్ట్ర సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థంగా చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్ హర్ మహేష్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ధరణి అక్రమాలపై సిట్

- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు
- పంచాయతీల సొంత ఆదాయం ఇక నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే
- బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ మార్పు.. ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపు
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల వ్యయాల పెంపునకు ఆమోదం



**హైదరాబాద్, జూలై 17 (ఆర్ఎన్ఎ):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ధరణి అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు నుంచి గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తి వరకు పలు అంశాలపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ధరణి ప్రారంభమైన నాటి నుంచి జరిగిన అన్ని లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు కూడా ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలతో పాటు అక్రమ మ్యుటేషన్లపై ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని నిర్ణయించింది. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం--2018లోని సెక్షన్ 70(3) సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటి వరకు ట్రెజరీలో జమ చేయాల్సిన గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ఇకపై నేరుగా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సవరణను అమల్లోకి తీసుకురావడానికి త్వరలో ఆర్డినెన్స్ జారీ చేయనుంది. జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన కొత్త పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భూమి కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరేలా బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌లో మార్పులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదేవిధంగా దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి, సీతారామ సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపునకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రంలో పరిపాలన సంస్కరణలు, గ్రామీణాభివృద్ధి, భూ పరిపాలనలో పారదర్శకత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వం పేర్కొంది.

# దేవాదాయ శాఖలో 191 మందికి ఉద్యోగాలు

- తెలంగాణ చరిత్రలో తొలిసారి భారీ స్థాయిలో మతపరమైన నియామకాలు
- రవీంద్రభారతిలో నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ
- అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులతో పాటు పలు విభాగాల్లో భర్తీ
- 'దేవాలయ సేవ ఉద్యోగం కాదు.. భగవంతుని సేవ చేసే పవిత్ర బాధ్యత'

**హైదరాబాద్, జూలై 17:** తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయే ఘట్టానికి శుక్రవారం నాంది పలికింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దేవాదాయ శాఖలో 191 మతపరమైన పోస్టులను భర్తీ చేస్తూ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వయంగా ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 47 ప్రధాన దేవాలయాల్లో అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాహనపూజ పురోహితులు, సహాయ వంటవారు, డోలు, సన్నాయి, మృదంగం, శృతి, తాళం తదితర విభాగాల్లో మొత్తం 191 మందిని నియమించడం దేవాదాయ శాఖ చరిత్రలో కొత్త అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దేవాలయ ఉద్యోగం కేవలం ఉపాధి కాదని, భగవంతుని సేవ చేసే పవిత్ర బాధ్యతగా ప్రతి ఉద్యోగి భావించాలని సూచించారు. "భక్తసేవే భగవత్సేవ" అనే భావనతో విధులు నిర్వహిస్తేనే ఆలయాల వైభవం మరింత పెరుగుతుందని అన్నారు. దేవాదాయ శాఖ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టడం దైవానుగ్రహంగా భావిస్తున్నానని, శాఖ అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని మంత్రి తెలిపారు. దేవాలయాల్లో నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, 'అర్చకులు మరియు ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్' ద్వారా మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. త్వరలో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాల నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. పనితీరు ఆధారంగా దేవాలయాల అన్ని విభాగాల ఉద్యోగులకు అవార్డులు కూడా అందజేస్తామని ప్రకటించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో వరుణయాగాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. నియామక పత్రాలు అందుకున్న పలువురు ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశం లభించడంతో భావోద్వేగానికి లోనయ్యారు. దేవుని సన్నిధిలో సేవ చేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, సీతా డైరెక్టర్ విజయ రాఘవాచార్యులు, ఆర్జేసీ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





# తెల్లవారుజాము వరకు కిక్కు!

## నేడు, రేపు ఉదయం 3 గంటల వరకు బార్లు ఓపెన్

## ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్

## ఫిఫా కీలక మ్యాచ్‌ల నేపథ్యంలో అర్ధరాత్రి దాటినా మద్యం విక్రయాలకు అనుమతి

## హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోనే..

**హైదరాబాద్, జూలై 17:** ఫిఫా ప్రపంచకప్ కీలక మ్యాచ్‌లను వీక్షించనున్న ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. జూలై 18, 19 తేదీల్లో జరిగే మ్యాచ్‌ల సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ల పరిధిలోని లైసెన్స్ పొందిన బార్లు, క్లబ్బులు, పర్యాటక బార్లు, మైక్రోబ్రూవరీల పనివేళలను పొడిగిస్తూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల ప్రకారం జూలై 18, 19 తేదీల్లో బార్లు తెల్లవారుజామున 4.30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇచ్చారు. అలాగే జూలై 19న జరిగే ఫైనల్ మ్యాచ్ వీక్షణ కోసం జూలై 19--20 మధ్య రాత్రి 3 గంటల వరకు మద్యం విక్రయాలు కొనసాగించేందుకు ప్రత్యేక అనుమతి మంజూరు చేశారు. ఫిఫా ప్రపంచకప్ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మూడో స్థానం కోసం జూలై 18న జరిగే మ్యాచ్, టైటిల్ పోరు కోసం జూలై 19న జరిగే ఫైనల్‌ను పెద్ద సంఖ్యలో అభిమానులు వీక్షించే అవకాశం ఉండటంతో ఈ వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ ఆమోదం అనంతరం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సడలింపు రాష్ట్రవ్యాప్తంగా కాకుండా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోని అనుమతి పొందిన సంస్థలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు.

# బాలికపై లైంగిక దాడి

## బెదిరించి పలుమార్లు అత్యాచారం.. గర్భం దాల్చిన బాధితురాలు

## ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు

## నిందితుల కోసం గాలింపు చేపట్టిన పోలీసులు

**నల్లగొండ, జూలై 17:** నల్లగొండ జిల్లాలో ఓ బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలికను బెదిరిస్తూ పలుమార్లు అత్యాచారం చేసినట్లు ఆరోపణలు రావడంతో ఆమె గర్భం దాల్చింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరు నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, అనుముల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మొదట ఒక యువకుడు మాయమాటలతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఈ విషయం తెలిసిన మరో యువకుడు, బయటకు చెబుతానని బెదిరిస్తూ ఆమెపై లైంగిక దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత బాలిక గర్భం దాల్చడంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. తల్లిదండ్రులు ఆరా తీయగా జరిగిన విషయాన్ని బాలిక వెల్లడించింది. వెంటనే వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు నిందితులపై పోక్సో చట్టంతో పాటు సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసిన పోలీసులు బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాలికలపై నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆశ్రమంలో గంజాయి సాగు!

## టాస్క్‌ఫోర్స్ దాడిలో స్వామీజీ బండారం బట్టబయలు

## 25 గంజాయి మొక్కలు, ఎండు గంజాయి స్వాధీనం

## వికారాబాద్ జిల్లాలో కలకలం.. కేసు నమోదు చేసి దర్యాప్తు



**వికారాబాద్, జూలై 17:** ఆధ్యాత్మిక ఆశ్రమం ముసుగులో గంజాయి సాగు చేస్తున్న ఘటన వికారాబాద్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. యాలాల మండలం గోవిందరావుపేట శివారులోని ఓ ఆశ్రమంలో గంజాయి సాగు జరుగుతోందన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి భారీగా గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా బృందం ఆశ్రమంపై నిఘా ఉంచి శుక్రవారం దాడులు నిర్వహించింది. తనిఖీల్లో ఆశ్రమ ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు గుర్తించారు. మొత్తం 25 గంజాయి మొక్కలతో పాటు గణనీయమైన పరిమాణంలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై నిజాముద్దీన్, యాలాల ఎస్సై విఠల్ రెడ్డి, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్న గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆశ్రమ నిర్వాహకుడితో పాటు గంజాయి సాగు వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, టౌన్ సీఐ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమంలో గంజాయి సాగు బయటపడటంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కేంద్రం పేరుతో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# 850 కిలోల నెయ్యి సీజ్

- రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల స్పెషల్ డ్రైవ్
- కమిషనర్ సంగీత సత్యనారాయణ





**హైదరాబాద్, జూలై 17 :** రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి ఇతర పదార్థాలు, కొవ్వులు కలుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జూలై 14, 15 తేదీల్లో పోలీసుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యానారాయణ తెలిపారు. కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు గుర్తించారు. సంబంధిత సంస్థల నుంచి నెయ్యి నమూనాలు సేకరించి టెస్టింగ్ కోసం పంపించామని, పరీక్షల ఫలితాల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్ అడిటివ్స్) రెగ్యులేషన్స్ ప్రకారం నెయ్యిలో 99.5 శాతం పాల కొవ్వు ఉండాలి. తేమ శాతం 0.5 శాతానికి మించకూడదు. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులను కలపడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం--2006 ప్రకారం నిషేధం అని ఆమె వివరించారు.

### 850 కిలోల స్వాధీనం

హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 14 సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. 15 నెయ్యి సాంపిల్స్‌ను సేకరించారు. వినియోగానికి పనికిరాదని గుర్తించిన 60 కిలోల నెయ్యి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. 850 కిలోల అనుమానాస్పద కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను ప్రయోగశాల నివేదికలు వచ్చే వరకు భద్రపరిచి, నివేదికల్లో కల్తీ నిర్ధారణైతే సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ స్పష్టం చేశారు. వివిధ జిల్లాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 65 సంస్థలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను పరిశీలించారు. మొత్తం 91 నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన 5 సంస్థలకు నోటీసులు జారీ చేశారు.

### వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

వినియోగదారులు లైసెన్స్ ఉన్న, విశ్వసనీయ సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యనారాయణ సూచించారు. కొనుగోలు చేసే ముందు FSSAI లైసెన్స్ నంబర్, మాన్యుఫాక్చరింగ్ లేబుల్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని పేర్కొన్నారు. కొనుగోలు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలు లేదా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



# నేడు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ

### సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

### పోలీసుల నిరాకరణపై న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బీఆర్ఎస్

### భారీగా తరలిరావాలని యువతకు పార్టీ పిలుపు

**హైదరాబాద్, జూలై 17:** బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యువ సంగ్రామ సభకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం ఉదయం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని షరతులతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. సభ సందర్భంగా జాతీయ రహదారులను దిగ్బంధం చేయరాదని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన యువత హామీల అమలును డిమాండ్ చేస్తూ ఈ సభను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ ప్రకటించింది. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. ఈ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడమే సభ ప్రధాన ఉద్దేశమని తెలిపింది. మొదట ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీఆరెస్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, సభ నిర్వహణకు షరతులతో అనుమతి మంజూరు చేసింది. అనుమతి దరఖాస్తు పెండింగ్‌లో ఉంచిన కారణాలపై కూడా ప్రభుత్వం నుంచి వివరణ కోరినట్లు తెలిసింది.

### కేటీఆర్ పిలుపు

హైకోర్టు తీర్పు అనంతరం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. యువత గళాన్ని అణిచివేయాలన్న ప్రభుత్వ ప్రయత్నం విఫలమైందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షిస్తూ హైకోర్టు సభకు అనుమతి ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువత తరఫున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున సరూర్‌నగర్ స్టేడియానికి తరలిరావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# భరత్‌కు బండి బహూమతి

- కొత్త ఆటో అందజేసిన కేంద్ర మంత్రి
- హిందుత్వ నినాదాలున్న ఆటోను స్వయంగా నడిపిన సంజయ్
- కరీంనగర్‌లో ఐదు కిలోమీటర్ల మేర ఆటో ప్రయాణం

**కరీంనగర్, జూలై 17:** హైదరాబాద్‌లో హిందుత్వ నినాదాలు రాసుకున్నందుకు కొందరు యువకుల దాడికి గురైన ఆటో డ్రైవర్ భరత్‌కు అండగా నిలబడటమే కాకుండా, ఇచ్చిన మాట ప్రకారం ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొత్త ఆటోను కొనిచ్చారు. ఈ సందర్భంగా హిందుత్వ నినాదాలతో కూడిన సదరు పాత ఆటోను బండి సంజయ్ కరీంనగర్‌లోని జ్యోతినగర్ ఉన్న తన నివాసం నుండి స్వయంగా నడుపుకుంటూ బయలుదేరారు. అనంతరం ఆటో డ్రైవర్ భరత్‌కు కొత్త ఆటోను అందజేశారు. వనపర్తి జిల్లాకు చెందిన ఆటో డ్రైవర్ చంచరి భరత్ కుమార్ తన ఆటోపై హిందుత్వ నినాదాలు రాయించుకోవడంతో ఇటీవల హైదరాబాద్‌లో కొందరు వ్యక్తులు ఆటో కవర్‌ను ధ్వంసం చేశారని, అనంతరం పోలీసు స్టేషన్‌కు రావాలని హెచ్చరించారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని భరత్ ఇటీవల బండి సంజయ్‌కు వివరించగా, ఆయన పూర్తి అండగా ఉంటానని హామీ ఇచ్చి కొత్త ఆటో అందజేస్తానని ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం భరత్‌కు కొత్త ఆటోను అందజేసిన బండి సంజయ్, హిందుత్వ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నందుకు అతన్ని అభినందించారు. భవిష్యత్తులో కూడా తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం కరీంనగర్ నగరంలోని లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే విద్యారణ్యపురి ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.





# సైదాబాద్ స్కూల్ ఇస్లాం బోధన వ్యవహారం

### తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్, జులై 17:** నగరంలోని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ స్కూల్లో వివాదాస్పద ఇస్లాం బోధనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగడంతో తల్లిదండ్రుల ఫిర్యయాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాబాద్ ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థితో బలవంతంగా ఇస్లామిక్ ప్రార్థనలు చేయించడం తీవ్ర సంచలనం రేపింది. క్లాస్ రూమ్‌లో సదరు బాలుడితో కల్మాలో భాగమైన సూరా అల్–ఫాతిహా పఠనం చేయాలని ఆదేశించడం తీవ్ర వివాదానికి దారితీసింది. రోజూ దానిని చదవాలంటూ స్కూల్ డైరీలో 'సూరా అల్ ఫాతిహా' అని రాసి ఒత్తిడి తెచ్చారని బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రవర్తించడం వల్లే తమ కుమారుడు భయాందోళనకు గురై రోజూ ఏడుస్తూ ఇంటికి వస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపుల వల్ల తమ మత స్వేచ్ఛతో పాటు తల్లిదండ్రుల హక్కులకు భంగం కలిగిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సైదాబాద్ పోలీసులు ప్రాథమిక సమాచార నివేదిక నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, క్లాస్ టీచర్‌లను నిందితులుగా చేరుస్తూ.. కేసు నమోదు చేసినట్లు పోలీసులు స్పష్టం చేశారు. బాలుడిపై మానసిక ఒత్తిడి తెచ్చిన ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని సైదాబాద్ పోలీసులు వెల్లడించారు.

# మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు మంచినీరు

### మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయం

**హైదరాబాద్, జూలై 17:** హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మల్లన్నసాగర్ జలాశయం నుంచి రోజుకు అదనంగా 25,30 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీలు) నీటిని తరలించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయించింది. సింగూర్, మంజీర జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తగ్గుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపడుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా మల్లన్నసాగర్ నీటిని హైదరాబాద్‌కు మళ్లించేందుకు సుమారు 4 కిలోమీటర్ల కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభించాయి. ఈ పనులను 50 నుంచి 60 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశిరచారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగినా నగరంలో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ జల వనరులను వినియోగించేందుకు జలమండలి కార్యాచరణ చేపట్టింది. అలాగే నగరానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, రోజువారీ అవసరాలు, భవిష్యత్ డిమాండ్‌పై సమగ్ర అంచనా వేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

### రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జులై 17:** రాష్ట్రంలో ఇప్పటి వరకూ సర్ ప్రక్రియ 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సుల్తాన్పూర్, ఐలాపూర్, పటాన్ చెరులో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సర్ ప్రక్రియపై బీఎల్వోలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిబిరాల వద్ద వివిధ పార్టీలకు చెందిన వారు ఉండటాన్ని గమనించి.. మీకు పార్టీ నుంచి గుర్తింపు కార్డులు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో పెట్టుకొని ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం అయిందని తెలిపారు. పీఎల్వో, బీఎల్వోల సహకారంతో సర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందకపోతే.. సూపర్ వైజర్‌లను అడిగి తీసుకోవాలన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం

### ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

**హైదరాబాద్, జులై 17:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుపక్కన నిలిపి ఉన్న ట్రాలీ ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతులు రాములు (60), రషీద్ (40)గా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే కీసర పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతులిద్దరూ మెదక్ జిల్లా వాసులుగా తెలుస్తోంది. ట్రాలీ ఆటోను ఢీకొట్టిన అనంతరం గుర్తుతెలియని వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పిల్లలతో కలిసి తల్లుల ఆత్మహత్య

- రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో విషాద ఘటనలు
- కుటుంబ కలహాల కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు





**రంగారెడ్డి/నాగర్‌కర్నూల్:** ఒకేరోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో కన్నపిల్లలతో కలిసి తల్లులు ఆత్మహత్యకు పాల్పడిన ఘోర ఉదంతాలు తీవ్ర కలకలం రేపాయి. క్షణికావేశంలో కన్నప్రేమను మరిచి పిల్లలను సైతం మృత్యువులోకి నెట్టిన ఈ ఘటనలు రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో జరిగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి, తాను కూడా దూకి ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన వసంత (35), సుధాకర్ దంపతులు కొంతకాలంగా కొత్తపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరికి 15 ఏళ్ల కుమార్తె, 10 ఏళ్ల కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా సాగుతున్న విభేదాల నేపథ్యంలో, గురువారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసంత.. రాత్రి వేళ పిల్లలిద్దరినీ తీసుకుని ఇల్లు వదిలి బయటకు వచ్చేసింది. ఊరి చివరన ఉన్న ఒక వ్యవసాయ బావి వద్దకు వెళ్లి, కన్నపిల్లలిద్దరినీ బావిలోకి తోసేసి, ఆపై తాను కూడా దూకేసింది. ఈ ప్రమాదంలో వసంతతో పాటు ఆమె కుమార్తె నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. అయితే, బావిలోకి తోసిన సమయంలో 10 ఏళ్ల బాలుడు అదృష్టవశాత్తూ లోపల ఉన్న చెట్టు కొమ్మలకు చిక్కుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పోతేపల్లి గ్రామంలో ఇద్దరు పసిపిల్లలతో కలిసి ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. గ్రామానికి చెందిన ఎనుముల శిరీష (23) అనే వివాహితకు మూడేళ్ల కుమార్తె మానశ్రీ, నాలుగు నెలల పసికందు వర్షిత్ ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసుకుని శిరీష తీవ్ర నిర్ణయం తీసుకుంది. తన ఇద్దరు బిడ్డలను ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపు (అండర్‌గ్రౌండ్ వాటర్ ట్యాంక్) లో పడేసి, అనంతరం తాను కూడా అందులోకి దూకేసింది. నీటిలో మునిగి తల్లీ, ఇద్దరు పిల్లలు అక్కడికక్కడే ఊపిరాడక మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. కుటుంబ కలహాల వల్లే శిరీష ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఒకేరోజు ఇద్దరు తల్లులు పసిప్రాణాలను బలితీసుకుని ఆత్మహత్యలకు పాల్పడటంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
18 జూలై 2026



# పార్లమెంట్‌లో పోరుకు రంగం సిద్ధం!

**వర్షాకాల సమావేశాల్లో అధికార-ప్రతిపక్షాల శక్తిపరీక్ష**

## డీలిమిటేషన్ బిల్లుపై వేడెక్కనున్న ఉభయ సభలు

**నీట్, రామమందిరం, ధరల పెరుగుదలపై కేంద్రాన్ని నిలదీయనున్న కాంగ్రెస్**

**కీలక బిల్లులతో ముందుకు సాగాలని ఎన్‌డీఏ వ్యూహం**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్యవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఏ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది. జూలై 20 నుంచి ప్రారంభ మయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులతో పాటు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మరోవైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్, రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెరుగుతున్న చమురు ధరలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కేంద్రం కూడా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా వ్యవహరిస్తోంది. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నా, వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకునే చొరవ కూడా తీసుకోవడం లేదు. మొత్తంగా ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ప్రవేశ పెడితే ఎలా నెగ్గుకు వస్తారన్నదే ఆసక్తిగా మారింది. మహిళా బిల్లును కలిపే పెడతారా అన్నది తెలియదు. అఖిలపక్షంలో చర్చించేందుకు ఎందుకనో మోడీ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. అదేదో పార్లమెంటులోనే చర్చించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్లు అర్థం అవుతోంది.

# భారత రైల్వేలో నూతన శకం

- పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు
- జింద్-సోనిపట్ మార్గంలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ
- కాలుష్య రహిత రవాణాకు కీలక అడుగు.. పర్యావరణహిత సాంకేతికతతో కొత్త అధ్యాయం
- డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా స్వచ్ఛ ఇంధన వినియోగానికి శ్రీకారం



**న్యూఢిల్లీ, జులై 17 (ఉద్యమ కెరటం):** భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి చేరింది. భారత రైల్వే చరిత్రలో నూతన శకం ఆరంభమైందనే చెప్పాలి. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలను ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు శుక్రవారం పట్టాలెక్కింది. హైడ్రోజన్‌తో నడిచే తొలి రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. హరియాణాలోని జింద్-సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు ప్రయాణించనుంది. ఉత్తర రైల్వేలో ప్రయోగాత్మక ప్రాజెక్టుగా దీనిని ప్రవేశపెట్టారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్ సాంకేతికతను రైల్వేలో వినియోగిస్తున్నారు. హైడ్రోజన్ ద్వారా విద్యుదుత్పత్తి చేసి రైలును నడిపే ఈ సాంకేతికతను డీజిల్ ట్రైన్స్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్‌లో హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే ప్రత్యేక సదుపాయాలనూ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో భారత్ చేరడం గర్వకారణం. స్వచ్ఛమైన, సుస్థిర సాంకేతికతను రైల్వే రంగంలో విస్తరించేందుకు ఇది కీలక అడుగుగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే.. రానున్న కాలంలో మరిన్ని మార్గాల్లో ఈ సేవల్ని విస్తరించే అవకాశాలున్నాయి. ఇది రైల్వే రంగంలో కాలుష్య నియంత్రణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, స్వచ్ఛ ఇంధన వినియోగానికి కొత్త దిశను చూపనుంది. జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాలు హైడ్రోజన్ ఆధారిత రైలు సాంకేతికతను ఇప్పటికే అభివృద్ధి చేస్తున్నాయి. కాగా.. ప్రపంచంలోనే తొలి హైడ్రోజన్ ప్యాసింజర్ రైలును జర్మనీ ప్రవేశపెట్టింది. 2002లో అల్‌స్టోమ్ కొరాడియా ఐలింట్ రైలు ఎలాంటి ఇంధనం లేకుండా 1,175 కి.మీ. ప్రయాణించి రికార్డు సృష్టించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో 2024లో తొలి హైడ్రోజన్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. అయితే.. 2027 నాటికి జపాన్.. తొలి హైడ్రోజన్ హైబ్రిడ్ రైలును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దేశంలో ప్రారంభం అయిన ఈ హైడ్రోజన్ రైలు తొలుత ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపత్ సెక్షన్‌లో నడుస్తుంది. 89 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. 10 కోచ్‌లతో ఈ రైలును అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 2600 మంది ప్రయాణించొచ్చు. త్వరలోనే కల్కా-శిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే లైన్‌లోనూ హైడ్రోజన్ పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్ రైళ్లు.. పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి. ఇక, సంప్రదాయ డీజిల్ రైలు ఇంజిన్లు ఇంధనాన్ని మండించి యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేస్తాయి. హైడ్రోజన్ రైలు సొంతంగా కరెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. దీని కోసం రైల్లో 'ప్రొటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్' అనే చిన్నపాటి పవర్‌ప్లాంట్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. తొలిసారిగా జర్మనీ దీన్ని ప్రవేశపెట్టింది. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు ప్రయోగాత్మకంగా నడపడమో లేక పరిమితంగా వినియోగంలోకి తీసుకురావడమో చేస్తున్నాయి. 1,200 కిలోవాట్ల సామర్థ్యం ఉండే ఫ్యూయెల్ సెల్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య జరుగుతుంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తవుతుంది. హైడ్రోజన్‌ను ట్యాంకుల రూపంలో రైలు మోసుకెళుతుంది. ఆక్సిజన్‌ను పరిసరాల్లోని గాలి నుంచి సేకరిస్తుంది. ఇలా ఉత్పత్తయిన విద్యుత్.. రైలులోని ట్రాక్షన్ మోటార్లకు శక్తిని అందిస్తుంది. అవి చక్రాలను నడుపుతాయి. దీని ప్రొపల్షన్ వ్యవస్థ సామర్థ్యం 3,200 హెచ్‌పీ. దీంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్న శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఇది గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇది శుద్ధ ఇంధన పరిజ్ఞానం. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి, వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా వెలువడతాయి. ఇందులో దహనచర్య జరగదు. అందువల్ల హానికారక పొగ, కర్బనఉద్గారాలు వెలువడవు. ధ్వని కూడా తక్కువే. రైల్లోని నాన్‌స్టాప్ వెంటిలేషన్ వ్యవస్థ.. గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూస్తుంది. అందువల్ల ఏదైనా లీకేజీ తలెత్తినా అది గాల్లోకి వెళ్లి, పలుచబడిపోతుంది. ప్రమాదాన్ని గుర్తిస్తే.. ఆటోమేటిక్ షట్‌ఆఫ్ వ్యవస్థ తనంతట తాను హైడ్రోజన్ సరఫరాను నిలిపివేస్తుంది. ఈ రైల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. అవి హైడ్రోజన్ లీకేజీలు, వేడి, మంటలు, పొగ వంటి ముప్పులపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతాయి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సెకన్లలోనే అప్రమత్తం చేస్తాయి. భద్రతకు ప్రాధాన్యమిస్తూ లోకోపైలట్ క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. లోకో పైలట్ ఎదుట ఉండే ఒక స్క్రీన్.. అన్ని అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.

# భారీ ఉగ్రకుట్ర భగ్నం



**గుజరాత్‌లో ఐదుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదుల అరెస్టు**

**ఉగ్ర నెట్‌వర్క్ ఏర్పాటు యత్నం.. బాంబు తయారీ కుట్ర వెలుగులోకి**

**ఉపా చట్టం కింద కేసు నమోదు.. జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీ**

**అహ్మదాబాద్, జూలై 17:** గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్రను రాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్) భగ్నం చేసింది. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైషే మహమ్మద్ ఉగ్రసంస్థకు చెందిన ఐదుగురు అనుమానితులను అరెస్టు చేసింది. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకాలోని ఖడియాల్ గ్రామంలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అరెస్టయిన వారిని బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా గుర్తించారు. వారిని మెహసానా జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.ఎం. భాటియా ఎదుట హాజరుపరచగా, జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు కుట్ర పన్నుతున్న నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగినట్లు ఏటీఎస్ వెల్లడించింది. ఈ నెల 3న అరెస్టు చేసిన మరో ఎనిమిది మంది అనుమానితులను విచారించగా, తాజాగా పట్టుబడిన ఐదుగురి పాత్ర వెలుగులోకి వచ్చినట్లు తెలిపింది. దర్యాప్తులో ఒక నిందితుడు క్రూడ్ టైమ్ బాంబు తయారు చేసి దానిని పరీక్షించేందుకు ప్రయత్నించినట్లు, మరో నిందితుడు బాంబు తయారీకి అవసరమైన సామగ్రిని అందించినట్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో క్రియాశీల ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి ఉగ్ర కార్యకలాపాలను విస్తరించడమే వారి లక్ష్యంగా ఉన్నట్లు ఏటీఎస్ పేర్కొంది. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని పలు సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# "జులై 20 వరకు ఎలాగైనా బతికి ఉంటా"

- ఆరోగ్యం క్షీణిస్తున్న వేళ సోనమ్ వాంగ్‌చుక్ భావోద్వేగ వ్యాఖ్యలు
- 20వ రోజుకు చేరిన నిరాహార దీక్ష.. పార్లమెంట్ పాదయాత్రకు ప్రజలకు పిలుపు
- ఆరోగ్యంపై వైద్యుల ఆందోళన.. వాంగ్‌చుక్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నేత పవన్ ఖేరా




**న్యూఢిల్లీ, జూలై 17:** నిరవధిక నిరాహార దీక్ష 20వ రోజుకు చేరుకున్న ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తాను శారీరకంగా బలహీనపడుతున్నప్పటికీ, సంకల్పం మాత్రం ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్న వాంగ్‌చుక్, "జులై 20 వరకు ఎలాగైనా బతికి ఉంటాను. ఒకవేళ చనిపోతే దెయ్యంగానైనా తిరిగి వస్తాను" అని అన్నారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్, జులై 20న పార్లమెంట్ వరకు చేపట్టనున్న శాంతియుత పాదయాత్రలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ విన్నపాన్ని పార్లమెంట్ ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా నిరాహార దీక్ష చేస్తున్న నేహా, మనీశ్, అమీన్ ఆరోగ్య పరిస్థితి కూడా విషమించిందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) వెల్లడించింది. డీహైడ్రేషన్ కారణంగా అమీన్ తీవ్ర ప్రమాదంలో ఉన్నారని, నేహా రక్తంలో చక్కెర స్థాయి ప్రమాదకర స్థాయికి పడిపోయిందని, మనీశ్ తన శరీర బరువులో 10 శాతానికి పైగా కోల్పోయాడని తెలిపింది. అయినప్పటికీ తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగిస్తామని విద్యార్థి నాయకులు ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా శుక్రవారం వాంగ్‌చుక్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్న వాంగ్‌చుక్ డిమాండ్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. వాంగ్‌చుక్ ఆరోగ్య వివరాలను విడుదల చేసిన వైద్యుడు సతీశ్ లాంబా ప్రకారం, గత 24 గంటల్లో ఆయన 350 గ్రాముల బరువు కోల్పోయారు. ప్రస్తుతం ఆయన బరువు 56.55 కిలోలకు చేరగా, రక్తపోటు 108/68, రక్తంలో చక్కెర స్థాయి 70 మిల్లీగ్రాములు/డెసిలీటర్, పల్స్ రేటు నిమిషానికి 72గా నమోదైంది. స్వల్ప డీహైడ్రేషన్ ఉన్నప్పటికీ వైద్య బృందం 24 గంటలూ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోందని తెలిపారు. దీర్ఘకాలిక నిరాహార దీక్ష కారణంగా శరీరంలోని కొవ్వు, కండరాలు క్షీణించే దశకు చేరిందని, అవయవాలపై

# టీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్గా రాథోడ్ బాపురావు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్గా రాథోడ్ బాపురావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్లోని నందినగర్లో ఉన్న పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలను అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని, నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# గోపాలరావుపేటలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని గోపాల్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల గోపాలరావుపేట గ్రామంలో రూ.10లక్షల డీఎంఎఫ్టీఎఫ్ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి శుక్రవారం గోపాల్ నగర్ గ్రామ సర్పంచ్ గాట్ల నర్సయ్య భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. భవనం పూర్తయితే గ్రామంలో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, పంచాయతీరాజ్ ఏఈ సాయిలత, కాంట్రాక్టర్ చీరల సాయికృష్ణ, కాంగ్రెస్ నాయకులు గాజుల రామ్మోహన్, అంజి, గాజుల రమేష్, వార్డు సభ్యులు ఇందూరి సాయికృష్ణ, కంబాల బానయ్య, నాయకులు కొండు శంకర్, పెండ్యాల శ్రీనివాస్, ఉట్నూరు శంకరయ్య, యాదగిరిరావు, మడే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత పాటించి గ్రామపంచాయతీకి సహకరించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** రాజీవ్నగర్ గ్రామ ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ గ్రామ పంచాయతీకి సహకరించాలని గ్రామ సర్పంచ్ మామిడాల లలిత రాజేశం కోరారు. శుక్రవారం గ్రామంలోని పలు వార్డుల్లో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలువలు, మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణ చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

# ఎస్.సి., ఎస్.టి.ల అభివృద్ధికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలి

- రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సమీక్షా సమావేశంలో వెల్లడి





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన చట్టాల ప్రకారం సంక్షేమ పథకాలు అందేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా అటవీ అధికారి బాలమణి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్, కుసుం నీలా దేవిలతో కలిసి సంక్షేమ పథకాలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, జిల్లాలో 1,33,627 మంది షెడ్యూల్డ్ తెగలు, 81,596 మంది షెడ్యూల్డ్ కులముల వారు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు సకాలంలో అందించాలని, వసతి గృహాలు, గురుకులాలలో మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం పెడుతూ, 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేలా నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు.అలాగే ఎస్.సి, ఎస్.టి గ్రామాలకు రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రహదారి నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు త్వరగా జారీ చేయాలని తెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూ వివాదాలను ఉమ్మడి సర్వే ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అట్రాసిటీ కేసులను త్వరగా విచారించి బాధితులకు తక్షణ పరిహారం అందించాలని, ప్రతి నెలా 30న నిర్వహించే 'పౌర హక్కుల దినోత్సవానికి' తహసిల్దార్, ఎస్.ఐ.లు తప్పనిసరిగా హాజరై చట్టాలపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ కింద అర్హులైన కుటుంబాలకు 100 రోజుల పని కల్పించడంతో పాటు, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో వీరికి ప్రాధాన్యత ఇవ్వాలని, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పి.ఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ ఎస్.సి, ఎస్.టి ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ నిధులను వారి ప్రాంతాల అభివృద్ధి కేటాయిస్తామని, రహదారులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అటవీశాఖ అనుమతులు త్వరగా వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే గిరిజనేతరుల పోడు భూముల సమస్యను కూడా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆర్డీఓలు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, డిఎస్పీలు అశోక్, వహీదుద్దీన్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







# ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్టౌన్:** ప్రభుత్వ ఆసుపత్రి, కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 21 నుండి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జిజిహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్ నిబంధనల ప్రకారం రూ.13,500 రావాల్సి ఉండగా, గత నాలుగేళ్లుగా కేవలం రూ.11,000 మాత్రమే ఇస్తూ కాంట్రాక్టర్లు శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పండుగ సెలవులు, పీ ఎఫ్, ఈ ఎస్ ఐ సక్రమంగా జమ చేయాలని, బోనస్, గ్రాట్యుటీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, నాయకులు మమత, మాధవి, జ్యోతి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే విజయమే

**కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి**



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి అన్నారు. కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోటీ పరీక్షల ఉచిత శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు నిరంతరం అధ్యయనం చేస్తూ ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే తప్పకుండా విజయం సాధించగలరని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ప్రయోజనార్థం ఇలాంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్చార్జి డాక్టర్ డి.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే సిలబస్కు అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలను అధ్యయనం చేయడంతో పాటు క్రమశిక్షణతో సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా పాల్గొన్న అభ్యర్థులకు ఓఎంఆర్ విధానంలో నమూనా పరీక్ష నిర్వహించారు. అలాగే కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు వి.దేవేందర్ రూపొందించిన ఈ-మెటీరియల్ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శారద, అధ్యాపకులు ఎం.రాజేశ్వర్, టి.దత్తాత్రేయ, కృష్ణవేణి, దేవేందర్, వెంకటేశం, రోజ్ మేరి, బోధనేతర సిబ్బంది సత్యనారాయణ, కిష్ట య్య, ముకుందరావు పాల్గొన్నారు.

# భూభారతి రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో అత్యాధునిక సాంకేతికతతో చేపడుతున్న భూభారతి రీ సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం బజార్హత్నూర్ మండలంలోని గంగాపూర్, డెడ్రా, మాన్కాపూర్ గ్రామాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రీ సర్వేలో భాగంగా ప్రతి భూమికి ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపుతో 'భూదార్' కార్డును అందజేస్తామని తెలిపారు. ఈ విధానం ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెరిగి, భవిష్యత్తులో భూ తగాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు నీటి సంరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. అవసరమైతే తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో విబిజి రాంజీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు నిలిచిపోయిన రహదారి పనులను త్వరిత గతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొన్నారు. రైతులు సమూహాలుగా ఏర్పడి రూ.9,150 చెల్లిస్తే విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించి మెరుగైన విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# శిథిలావస్థ లో వసతి గృహాలు..

- నూతన భవనాలు మంజూరు చేయాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు కేవీపీఎస్ వినతి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లా కేంద్రం వచ్చిన రాష్ట్ర కమిషన్ చైర్మన్‌కు కేవీపీఎస్ జిల్లా నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, జిల్లా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ జిల్లా లోని గురుకులాలు, హాస్టళ్లలో వేలాది మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుంటున్నారని, అయితే అనేక విద్యాసంస్థలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతుండటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇరుకైన గదుల్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనేక చోట్ల తాగునీరు, మరుగుదొడ్లు , స్నానాల గదులు, వంటశాలలు, డైనింగ్ హాళ్లు, క్రీడా మైదానాలు, ప్రహరీ గోడలు వంటి కనీస వసతులు లేక విద్యార్థుల ఆరోగ్యం, భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో 1971లో నిర్మించిన సాంఘిక సంక్షేమ వసతి గృహం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరినందున, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దానికి తక్షణమే నూతన భవనాన్ని నిర్మించాలని



నాయకులు కోరారు. అలాగే రెబ్బెన సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల కళాశాలకు, సిర్పూర్ (టి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలతో పాటు జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలకు శాశ్వత సొంత భవనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ తక్షణమే స్పందించి జిల్లాలోని అన్ని గురుకులాలు, వసతి గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల నాణ్యమైన విద్య, పరిశుభ్రత కోసం ప్రత్యేక నిధులు విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ సిఫారసు చేయాలని వారు కోరారు.

# రైతుల ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు
- బొక్కివాగు ప్రాజెక్టు కుడి కాలువ గేటు ద్వారా సాగునీటి విడుదల



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్బాబు అన్నారు. పెంచికల్పేట్ మండలంలోని ఎల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో గల బొక్కివాగు ప్రాజెక్టు కుడి కాలువ గేటు మరమ్మత్తులు పూర్తి కావడంతో శుక్రవారం గేటును ఎత్తి సాగునీటిని విడుదల చేశారు. దీంతో గత కొన్నేళ్లుగా గేటు దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్ట పడడంతో పాటు రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా కుడి కాలువ గేటు విరిగిపోవడంతో సాగునీరు వృథాగా పోతున్న సమస్యను ఎల్లూరు సర్పంచ్ చప్పిడే రవీందర్ వారం రోజుల క్రితం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టి నూతన గేటును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసరంగా స్పందించి పనులు పూర్తి చేసిన ఇరిగేషన్ శాఖ అధికారులను అభినందించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని హామీ ఇచాచరు. ఈ కార్యక్రమంలో ఎల్లూరు సర్పంచ్ చప్పిడే రవీందర్, భక్తు రామచందర్, బీజేపీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్, నాయకులు చప్పిడే సత్యనారాయణ, చిలివేరు భాస్కర్, ఘనపురం నాగేష్, కడంబ శ్రీనివాస్, బోయిరే నాన్నయ్య, అన్నం గణపతి, పల్లె ం పురుషోత్తం, కారు చంద్రయ్య, అనంతరావు, డోకె నారాయణ, బద్ది శంకర్, సామెర రామన్న, దుర్గం శోభన్, శ్రీనివాస్, మడే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గ్రామాల్లో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

- మాజీ ఎంపీ సోయం బాపూరావు భూమిపూజ
- టేకుగూడలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తలమడుగు మండలంలోని పలు ఆదివాసీ గ్రామాల్లో రూ.50లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మాజీ ఎంపీ సోయం బాపూరావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఆయన ప్రత్యేక చొరవతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సోయం బాపూరావు మాట్లా డుతూ ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. మంజూరైన నిధుల్లో కొత్త నందిగామకు రూ.10 లక్షలు, చిన్న మందగూడకు రూ.10లక్షలు, ఝరి షేక్ గూడకు రూ.10లక్షలు, పూనగూడకు రూ.5లక్షలు, కోసాయికి రూ.5లక్షలు, రత్నపూర్ గ్రామానికి రూ.5లక్షల చొప్పున కేటాయించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం తలమడుగు మండలం టేకుగూడలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించి లబ్ధిదారులకు గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, బొల్లారం బాబన్న, మాజీ ఎంపీపీలు కళ్యాణం రాజేశ్వర్, రాము, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కె.ప్రతాప్, ప్రకాష్ రావు, మాజీ ఎంపీటీసీలు పి.మాధవ్, వెంకన్న యాదవ్, సర్పంచులు పెందుర హనుమంతు, సంజీవ్, వినాయక్, నాయకులు ఎల్.ప్రవీణ్ రెడ్డి, జి.సాంబశివ్, పల్లి విఠల్, నర్సయ్య, సల్ల దేవన్న, జ్ఞానేశ్వర్, దేవరావు పటేల్, మాజీ సర్పంచ్ రఘు మోహన్ రెడ్డి, రాజు, మాణిక్, ఎస్.కె. అలీమ్, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# పాఠశాలలు, అంగన్వాడీల్లో మెరుగైన సేవలు అందించాలి

**ఉద్యమ కెరటం, జైనూర్:** పాఠశాలలు, అంగన్వాడీల్లో మెరుగైన సేవలు అందించాలని గ్రామ సర్పంచ్ మరప రవీందర్ అన్నారు. శుక్రవారం జైనూర్ మండలం ఆశేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని టిడబ్ల్యూపీఎస్ పాఠశాలతో పాటు అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యా, పోషకాహార, మౌలిక వసతుల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి చదువుపై మరింత ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. వారికి అవసరమైన విద్యా సామాగ్రిని అందజేసి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల అభ్యాస స్థాయి, హాజరు, బోధనా





విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా మరింత కృషి చేయాలని సూచించారు. తర్వాత అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ప్రీ–స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ, కేంద్ర నిర్వహణను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హ లబ్ధిదారునికి చేరేలా అంగన్వాడీ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పాఠశాల, అంగన్వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని మండల వ్యవసాయ అధికారి సుష్మ అన్నారు. మండలంలోని గోపాల్నగర్ గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లడం ద్వారా భూమి సారవంతం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా దీర్ఘకాలం ఆర్థికంగా కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, రైతులు వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగయ్యే పత్తి, కంది, ఇతర పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



# గుత్పాల గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం

## ఫోర్జ రీ సంతకాలపై సర్పంచ్ ఫిర్యాదు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని గుత్పాల గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు గ్రామ సర్పంచ్ లక్ష్మీబాయి పెందూర్ శుక్రవారం నేరడిగొండ ఎంపీడీఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. గ్రామ పంచాయతీకి చెందిన 13 బిల్లులను సర్పంచ్ ప్రమేయం లేకుండానే, తన సంతకాలను ఫోర్జరీ చేసి నిధులు దుర్వినియోగం చేశారని సర్పంచ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉప సర్పంచ్ లింగంపల్లి రామ సురేష్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ లు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు చేశారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించిన సాక్ష్యాధారాలను కూడా ఎంపీడీఓకు సమర్పించినట్లు తెలిపారు. దీనిపై తక్షణమే విచారణ జరిపి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# నీట్ లో జైనూర్ విద్యార్థిని ప్రతిభ



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని సుమయ్య ఫాతిమా ఇటీవల జరిగిన నీట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటింది. 1 నుంచి 7వ తరగతి వరకు జైనూర్ మండల కేంద్రంలోని కేరళ గ్రామర్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన సుమయ్య ఫాతిమా పదవ తరగతి వరకు అదిలాబాద్లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ చైతన్య జూనియర్ కళాశాలలో పూర్తి చేసి నీట్ పరీక్ష రాసింది. అందులో మంచి మార్కులు వచ్చే అవకాశాలు ఉండగా, పేపర్ లీక్ కారణంగా దేశ వ్యాప్తంగా నీట్ ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి జూన్ 21న నిర్వహించింది. నీట్ పరీక్ష ఫలితాలు గురువారం రాత్రి విడుదల కాగా, ఈ పరీక్షలో సుమయ్య ఫాతిమా 451 మార్కులు సాధించింది. వెనుకబడిన మారుమూల మండలమైన జైనూర్ నుంచి నీట్లో అత్యధిక మార్కులు సాధించడం పట్ల సుమయ్య ఫాతిమా తో పాటు ఆమె కుటుంబీకులకు పలువురు అభినందనలు తెలియజేశారు.

# పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

## మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారానే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు మహాలక్ష్మీవాడలో మున్సిపల్, శానిటేషన్, ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రై డే–ఫ్రైడే' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించిన చైర్పర్సన్ స్థానిక ప్రజలతో మాట్లాడి, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి కుటుంబం ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇందులో భాగంగా కాలనీలో దోమల నివారణ మందును పిచికారీ చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. అనంతరం కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్లా స్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, వార్డు కౌన్సిలర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, పీహెచ్సీ వైద్యులు, హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు, శానిటేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తీరనున్న రవాణా కష్టాలు

**• పిప్పల్కోటి–తాంసీ(కె) గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం**



**ఉద్యమ కెరటం, భీంపూర్:** పిప్పల్కోటి గ్రామం నుంచి తాంసీ(కె) వరకు ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం పిప్పల్కోటి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి గ్రామపంచాయతీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పిప్పల్కోటి–తాంసీ(కె) మధ్య సరైన రహదారి లేక రైతులు, విద్యార్థులు, ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని దృష్టిలో ఉంచుకొని గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండి పనిచేస్తామని, గ్రామాభివృద్ధే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాంసీ(కె) సర్పంచ్ ఆత్రం గోవర్ధన్, నాయకులు ప్రవీణ్, సంతోష్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, రమేష్, ఉప సర్పంచ్ శంకర్, శ్రీను, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నేరడిగొండలో విద్యుత్ కోతలు

**పగలంతా సజావు.. రాత్రయితే అంధకారం..?**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గడచిన కొద్ది రోజులుగా నేరడిగొండ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా తీరుపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా అకస్మాత్తుగా నిలిచిపోతుండటం, తిరిగి ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పగటిపూట విద్యుత్ సరఫరా సజావుగా సాగుతున్నప్పటికీ, రాత్రి వేళల్లోనే ఈ సమస్య ఎందుకు ఉత్పన్నమవుతుందనే దానిపై స్పష్టత లేక వినియోగదారులు అయోమయంలో ఉన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ నిలిచిపోవడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలగడమే కాకుండా, ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట కరెంటు లేకపోవడంతో దోమల బెడద పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని నేరడిగొండ మండల విద్యుత్ శాఖ ఏఈని మండల వాసులు కోరుతున్నారు. పగటిపూట నిరంతరాయంగా సరఫరా అందుతుండగా, రాత్రి వేళల్లోనే సరఫరా ఎందుకు ఆగిపోతుందో విచారించి, తక్షణమే సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

**కల్లూరు పోలీసుల డ్రగ్స్ నిరోధక తనిఖీలు**




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ఖమ్మం జిల్లా కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై హరిత ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఎస్సై హరిత మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు విద్యార్థులు, యువతతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు భవిష్యత్తును నాశనం చేస్తాయని అన్నారు. వాటి వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఓరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల ఆధీనంలో గల పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి తో కలిసి జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజ నీరింగ్, ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో తరగతి గదుల మరమ్మత్తులు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు, క్రీడా స్థలాల అభివృద్ధి, క్రీడా పరికరాల కొనుగోలు అంశాలను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంతల పనులు చేపట్టాలని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల సంఖ్య పెంపొందించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, డ్రాప్ బ్యాక్ లో ఉన్న విద్యార్థులను ఆన్లైన్ చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఎఫ్.ఆర్.ఎస్. హాజరు శాతం తక్కువ నమోదుపై కారణాలను తెలుసుకున్నారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా, పోషక విలువలతో పరిమాణంతో కూడిన భోజనాన్ని అందించాలని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలో ప్రతి పాఠశాలను పర్యవేక్షించాలని, ఆపార్ 53 శాతం, ఆధార్ 90 శాతం ఉందని, వీటి శాతాన్ని పెంపొందించాలని, పాఠశాల వివరాలను యు–డైస్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలోని 118 ప్రీ ప్రైమరీ పాఠశాలలలో విద్యార్థులను 100 శాతం చేర్పించాలని, మండల విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ముఖచిత్రం మార్చేలా అభివృద్ధి పనులు

**• మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు శరవేగంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో త్వరలో రూ.100 కోట్ల భారీ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, ప్రస్తుతం పట్టణంలో రూ.40 కోట్ల విలువైన వివిధ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ గోడం నగేష్తో కలిసి పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజలు నిర్వహించారు. తిరుపల్లి రామాలయంలో భక్తుల సౌకర్యార్థం 15వ ఆర్థిక సంఘం మున్సిపల్ నిధులతో రూ.8లక్షల వ్యయంతో నిర్మించనున్న బాత్రూమ్లు, టాయిలెట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిరుపల్లి కోర్టు పరిధిలోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, అర్హులైన వారికి ప్లాట్ల కేటాయింపుపై స్థానికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**రూ.4 కోట్లతో కళాశాల ఆధునీకరణ..**

ఆర్టికల్–275 నిధుల ద్వారా రూ.4కోట్ల వ్యయంతో ఆదిలాబాద్ పట్టణంలోని టిడబ్ల్యూజేసీ కళాశాల ప్రాంగణంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎంపీ గోడం నగేష్తో కలిసి భూమిపూజ నిర్వహించారు. విద్యార్థులకు ఆధునిక మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ జగదీశ్ గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'ఎస్ఐఆర్' సర్వేలో ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ సర్వేను వంద శాతం విజయవంతం చేసి ప్రతి అర్హుడి వివరాలు నమోదయ్యేలా అధికారులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు సూచించారు. శుక్రవారం సిర్పూర్(యు) మండలంలోని పుల్లారా, సీతాగొంది, పంగిడి, బాబ్జీపేట్, పవర్గూడ తదితర గ్రామాలు, గిరిజన గూడాల్లో విస్తృతంగా పర్యటించారు. బీఎల్ఏలతో కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఐఆర్ సర్వే గ్రామీణ ప్రజల వివరాలను సమగ్రంగా నమోదు చేసే కీలక ప్రక్రియ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క అర్హుడు మిగిలిపోకుండా ప్రతిఒక్కరి వివరాలు నమోదు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు తావు ఇవ్వకుండా అధికారులకు సరైన సమాచారం అందించి సర్వేను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్రావు, జిల్లా నాయకుడు పెందూర్ ప్రకాష్, సర్పంచులు ఆత్రం మీరాబాయి, జాలీమ్ షా, వేడమ్మ జంగుబాయి, కోట్నాక్ బాపూజీ, పెందూర్ మాధవరావు, మెస్రం భూపతి, వేడమ్మ దత్తు, సేడమకి నాగోరావు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మండల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, పరిశుభ్రతలో మార్లవాయి ఆదర్శం





**• గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారి గోమాసా జాసింత్ జోయెల్**

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండలం మార్లవాయి గ్రామాన్ని ట్రైనింగ్ ఐఏఎస్ అధికారి గోమాసా జాసింత్ జోయెల్ శుక్రవారం సందర్శించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసి ఆత్మబంధువులుగా పేరొందిన ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల అభ్యున్నతికి విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో వారు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం గ్రామంలోని డార్ఫ్ రీడింగ్ రూమ్, స్టడీ హాల్ను పరిశీలించి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అమలు చేస్తున్న పరిశుభ్రత, పచ్చదనం, అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తనవంతు బాధ్యతను చాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనక ప్రతిభ ట్రైనింగ్ ఐఏఎస్ అధికారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోమాసా జాసింత్ జోయెల్ మాట్లాడుతూ "ఆదివాసి గ్రామపంచాయతీ మార్లవాయి పరిశుభ్రత, పచ్చదనం, అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామం ఎంతో అందంగా ఉందని, త్వరలో నా కుటుంబ సభ్యులతో కలిసి మరోసారి సందర్శిస్తానని పేర్కొన్నారు. గ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ కలెక్టర్ కూడా మార్లవాయి పనితీరును "అద్భుతం"గా అభివర్ణించారు. పూర్వ ఆదిలాబాద్ జిల్లాలో మార్లవాయి ఆదర్శ గ్రామంగా నిలుస్తోందని, ముఖ్యంగా డార్ఫ్ లైబ్రరీ, స్టడీ హాల్, పరిశుభ్రత తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గెడం పార్వతి, గణపత్, గ్రామ పటేల్ అర్జున్, హెడ్మాస్టర్ పార్వతి, ఉపాధ్యాయులు కనక వెంకటేశ్వరరావు, కనక సోనేరావు, నాగేష్, తుకారం, శీను, అమృత్, శంకర్, గ్రామస్థులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



**ఉద్యమ కెరటం, కౌటాల:** ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని ఏఈఓ చౌదరి అంజన్న అన్నారు. మండలంలోని నాగేపల్లి గ్రామంలో సర్పంచ్ బిక్కు అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మేరకు వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు తెలిపారు. ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని పేర్కొన్నారు. తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు నష్టాలను నివారించవచ్చని వివరించారు. ప్రభుత్వ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ హరిలాల్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కమిషన్కు సర్పంచ్ ఫిర్యాదు

- **అటవీ అధికారుల తీరుపై ఆగ్రహం**

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బృందం శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా బెజ్జూర్ మండలం తుమ్మలగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ కొండా రాంప్రసాద్ లుంబినీ నగర్ గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ లుంబినీ నగర్లో సుమారు 80 మంది రైతులు దాదాపు 40 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూ నివాసం ఉంటున్నారని తెలిపారు. 2010లో భూ పంపిణీ ద్వారా 32 మంది రైతులకు పట్టాలు, మిగిలిన రైతులకు పహానీలు అందించగా, వాటి ఆధారంగా 2012లో ఇందిరా జలప్రభ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 9 ఉచిత వ్యవసాయ బోర్లు, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. రైతులు పంట రుణాలు, పంట నష్ట పరిహారం, సబ్సిడీలు తదితర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం అటవీ అధికారులు సాగును అడ్డుకుంటూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 2005లో అటవీ శాఖ ఏర్పాటు చేసిన సరిహద్దును రైతులు ఎప్పుడూ దాటలేదని, అయినప్పటికీ ప్రస్తుతం అదే భూముల్లో మొక్కలు నాటుతామని చెప్పి బలగాలతో వచ్చి సాగు పనులను అడ్డుకుంటున్నారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. లుంబినీ నగర్లో గతంలో ప్రభుత్వ నిధులతో పాఠశాల భవనం, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, ఈ ఏడాది నుంచి అటవీ అధికారులు గ్రామ అభివృద్ధి పనులను కూడా అడ్డుకుంటున్నారని వివరించారు. సర్పంచ్ ఫిర్యాదుపై స్పందించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్వో)కు గ్రామాల్లో రోడ్లు, భవనాలు, ఇండ్లు, గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని సమావేశంలోనే ఆదేశించారు. ప్రజా



ప్రతినిధులు, ప్రజలతో దురుసుగా ప్రవర్తించే అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అవసరమైతే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు, సస్పెన్షన్ వరకు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎమ్మెల్సీ నిధులు, ప్రభుత్వ నిధులతో మంజూరైన రోడ్లు, బోర్వెల్లు, వాష్రూములు, సీసీ రోడ్లు, భవనాల నిర్మాణ పనులను అడ్డుకోవడం, సర్పంచ్కు సమాచారం ఇవ్వకుండా ట్రాక్టర్, జేసీబీ, బోర్వెల్ వాహనాల డ్రైవర్లు, యజమానులకు ఫోన్ చేసి వాహనాలను సీజ్ చేస్తామని బెదిరించడం వంటి అంశాలపై బెజ్జూర్ రేంజ్ పరిధిలోని రెబ్బెన శివారులో బీట్ ఆఫీసర్గా పనిచేస్తున్న సాగరికపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్కు సర్పంచ్ కొండా రాంప్రసాద్ ఫిర్యాదు చేశారు. గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలిగించే చర్యలను వెంటనే నిలిపివేసి, రైతులకు న్యాయం చేయాలని కమిషన్ను కోరారు.

# 31లోగా రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలో ఉన్న జిల్లాలోని అన్ని రేషన్ కార్డుదారులు ఈనెల 31వ తేదీలోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) వి.రాములు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్ట ర్ ఛాంబర్లో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల్లో లబ్ధిదారుల వివరాల పారదర్శకతను నిర్ధారించడం, నకిలీ లబ్ధిదారులను గుర్తించి తొలగించడం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ రాయితీ ప్రయోజనాలు నిరంతరాయంగా అందేలా చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లాలో ఇంకా చాలా మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయలేదని అన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి జిల్లా లో వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు సంబంధిత రేషన్ దుకాణం, సమీపంలోని ఏదైనా రేషన్ షాప్కు వెళ్లి ఈ-పోస్ యంత్రం ద్వారా వేలిముద్రలు నమోదు చేసి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.



గడువులోపు ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు భవిష్యత్తులో రేషన్ పంపిణీలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రతి రేషన్ కార్డుదారుడు వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరంతరాయంగా పొందాలని కోరారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- **సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి**
- **భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం**
- **రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:**

జిల్లా లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్ట ర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్ల oపల్లి సబ్కలెక్టర్ మనోజ్, కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులతో కలిసి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, ఆర్ఓఎఫ్ఆర్ చట్టం అమలు, మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. జిల్లాలో సుమారు 56,969 మంది షెడ్యూల్డ్ తెగలు, 1,99,493 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు ఉన్నారని తెలిపారు. వారికి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, దుప్పట్లు, బంకర్ బెడ్లు, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జాబ్కార్డు కలిగిన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఉపాధి కల్పించాలని, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.20లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు.



### భూ సమస్యలు, అట్రాసిటీ కేసులపై సమన్వయంతో చర్యలు..

ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు నిబంధనల మేరకు భూ పట్టాలు జారీ చేసేలా రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ కేసులను వేగంగా విచారించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెల్ట్షాపులపై కఠిన చర్యలు చేపట్టాలని, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు, పీఎఫ్, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో రహదారులు, తాగునీటి వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వెయ్యికి పైగా అట్రాసిటీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా లో కూడా ప్రత్యేక కోర్టు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, దుర్గ మల్లయ్య, పెద్ది రాజన్న, పౌరసరఫరాల కమిటీ సభ్యులు జిల్లపల్లి వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే అందజేయాలి



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత అధికారులకు సకాలంలో అందజేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ షేక్ ముస్తఫా అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల గేట్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్యూమరేషన్ కౌంటర్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓటర్లు తాము తీసుకున్న సర్వే ఫారాలను పూర్తిగా నింపి ఆలస్యం చేయకుండా కౌంటర్ల వద్ద సమర్పించాలని కోరారు. ప్రతి అర్హుడి వివరాలు నమోదు కావడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, సర్వే ప్రక్రియలు సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా కౌంటర్లలోని అధికారులను సంప్రదించి సరైన వివరాలతో ఫారాలను సమర్పించాలని సూచించారు. సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:**

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ 4వ వార్డులో మందమర్రి మండల తహశీల్దార్ సతీష్ కుమార్, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డితో కలిసి, అలాగే మందమర్రి మున్సిపాలిటీ 19వ వార్డులో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు. జిల్లాలో డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. బీఎల్ఓలు సేకరించిన ఫారాల్లో ని వివరాలను ఎప్పటికప్పుడు బీఎల్ఓ యాప్లో స్పష్టంగా నమోదు చేయాలని, బూత్ స్థాయి ఏజెంట్లు ఫారాల సేకరణలో పూర్తి సహకారం అందించాలని తెలిపారు. అర్హులైన ఓటర్లు స్వయంగా ఆన్లైన్లోతమ వివరాలను నమోదు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కునే అలవాటు పెంపొందించాలని పేర్కొన్నారు. కేజీబీవీలను ఇంటర్మీడియట్ స్థాయికి ఆధునికీకరించామని, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఫిఫా ప్రపంచకప్ విజేతలకు తొలిసారి 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'






**న్యూయార్క్, జులై 17 (ఉద్యమ కెరటం):** ఫుట్‌బాల్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫిఫా ప్రపంచకప్--2026లో విజేతగా నిలిచే జట్టుకు ఈసారి సరికొత్త గౌరవం దక్కనుంది. ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీ, బంగారు పతకాలతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'ను కూడా అందజేయనున్నట్లు ఫిఫా ప్రకటించింది. అమెరికన్ క్రీడల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ సంప్రదాయాన్ని అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తొలిసారిగా అమలు చేయనున్నారు. ఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే ఈ ప్రత్యేక ఉంగరాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలుత విజేత జట్టు కెప్టెన్, ప్రధాన కోచ్‌కు ప్రత్యేక రింగ్స్ అందజేస్తారు. అనంతరం జట్టు సభ్యుల కోసం రూపొందించిన మొత్తం 30 ఒరిజినల్ రింగ్స్‌ను అధికారికంగా బహూకరిస్తారు. ప్రతి రింగ్‌పై ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీ ప్రతిరూపంతో పాటు విజేత జట్టుకు సంబంధించిన ప్రత్యేక డిజైన్ ఉంటుంది. ప్రతి ఉంగరానికి ప్రత్యేక సీరియల్ నంబర్‌తో పాటు అసలైనదని ధ్రువీకరించే ప్రమాణపత్రం కూడా అందజేయనున్నారు. ఈ అరుదైన జ్ఞాపకాన్ని అభిమానులకు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం 2,026 ఛాంపియన్‌షిప్ రింగ్స్‌ను తయారు చేయాలని ఫిఫా నిర్ణయించింది. అందులో 30 రింగ్స్ విజేత జట్టుకు కేటాయించగా, మిగిలిన 1,996 రింగ్స్‌ను అధికారిక లైసెన్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులకు విక్రయించనున్నారు. దీంతో ప్రపంచకప్ చరిత్రలో భాగమైన ప్రత్యేక జ్ఞాపకాన్ని అభిమానులు సొంతం చేసుకునే అవకాశం లభించనుంది. ఇదిలా ఉండగా, 2026 ఫిఫా ప్రపంచకప్ తుది సమరానికి రంగం సిద్ధమైంది. ఫైనల్లో యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా జట్లు తలపడనున్నాయి. సెమీఫైనల్లో ఫ్రాన్స్‌పై విజయం సాధించిన స్పెయిన్ ఫైనల్‌కు చేరుకోగా, అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించి మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. ఈ తుది పోరుపై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

# డోపింగ్ కేసులో మొహమ్మద్ నవాజ్‌కు ఊరట



**దుబాయ్, జూలై 17 (ఉద్యమ కెరటం):** పాకిస్థాన్ ఎడమచేతి స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్‌కు డోపింగ్ వివాదంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఊరటనిచ్చింది. యాంటీ-డోపింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి తొలుత విధించిన మూడు నెలల నిషేధాన్ని చికిత్సా కార్యక్రమం పూర్తి చేసిన నేపథ్యంలో ఒక నెలకు తగ్గించింది. దీంతో నవాజ్ మళ్లీ పోటీ క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 7న శ్రీలంకలోని కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్ అనంతరం నిర్వహించిన డోపింగ్ పరీక్షలో నవాజ్ శరీరంలో కార్బాక్సీ-టీహెచ్‌సీ అనే నిషేధిత పదార్థం ఉన్నట్లు తేలింది. ఇది గంజాయిలో ఉండే టీహెచ్‌సీ సమ్మేళనం శరీరంలో మార్పు చెందిన రూపంగా గుర్తించబడుతుంది. నవాజ్ నిబంధనల ఉల్లంఘనను అంగీకరించినప్పటికీ, ఆ పదార్థాన్ని పోటీలకు వెలుపల మాత్రమే ఉపయోగించానని, తన క్రీడా ప్రదర్శనను మెరుగుపరచుకోవడానికి దానిని వినియోగించలేదని ఐసీసీ ఎదుట వివరించాడు. అతని వివరణతో సంతృప్తి చెందిన ఐసీసీ, మాదకద్రవ్యాల దుర్వినియోగ నిరోధక చికిత్సా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తే శిక్షను తగ్గిస్తామని ప్రకటించింది. మే 1 నుంచి అమల్లోకి వచ్చిన తాత్కాలిక సస్పెన్షన్‌ను పరిగణనలోకి తీసుకుని, నవాజ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఐసీసీ వెల్లడించింది. చికిత్సా కార్యక్రమాన్ని పూర్తిగా పూర్తి చేసినందున ఇకపై అదనపు అనర్హత కాలాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అయితే, యాంటీ-డోపింగ్ నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 7 నుంచి మే 1 వరకు నవాజ్ ఆడిన అన్ని మ్యాచ్‌లలోని వ్యక్తిగత గణాంకాలను అధికారికంగా రద్దు చేశారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తరఫున ఏడు మ్యాచ్‌లు ఆడిన నవాజ్ 15 పరుగులు చేసి ఏడు వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ముల్తాన్ సుల్తాన్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 54 పరుగులు చేసి ఆరు వికెట్లు సాధించాడు. తాజాగా లంక ప్రీమియర్ లీగ్‌లో గాలె గ్లాడియేటర్స్ తరఫున ఆడేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రం కూడా లభించడంతో నవాజ్ త్వరలోనే మళ్లీ పోటీ క్రికెట్‌లో కనిపించనున్నాడు.




# ధోనీ కోసమే సీఎస్‌కేలో..

**సంజూ శాంసన్**

**చెన్నై, జూలై 17 (ఉద్యమ కెరటం):** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో తన జట్టు మార్పుపై వస్తున్న చర్చలకు చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ సంజూ శాంసన్ తొలిసారిగా స్పందించారు. మహేంద్ర సింగ్ ధోనీతో కలిసి ఆడాలనే కోరికతోనే చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరినట్లు ఆయన వెల్లడించారు. రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం తన కెరీర్‌లో అత్యంత కఠినమైన నిర్ణయమని, అయితే కొన్ని పరిస్థితుల కారణంగా ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. దాదాపు పదేళ్లపాటు రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సంజూ శాంసన్, ఆ జట్టుకు కెప్టెన్‌గా కూడా సేవలందించారు. అయితే ఐపీఎల్--2026 సీజన్‌కు ముందు ప్లేయర్ ట్రేడింగ్ విండో ద్వారా చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడం క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఒకే ఫ్రాంచైజీకి సుదీర్ఘకాలం సేవలందించిన ఆటగాడు అకస్మాత్తుగా జట్టు మారడంపై అనేక ఊహాగానాలు వినిపించాయి. తాజాగా జియోస్టార్ నిర్వహించిన 'సూపర్ స్టార్స్ షో'లో మాట్లాడిన సంజూ శాంసన్, తన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వెల్లడించారు. మహేంద్ర సింగ్ ధోనీతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం, ఆయన నుంచి మరింత నేర్చుకోవాలనే ఆకాంక్ష కూడా చెన్నై జట్టులో చేరడానికి ఒక ప్రధాన కారణమని పేర్కొన్నారు. అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్‌ను విడిచి రావడం తనకు భావోద్వేగపూరితమైన నిర్ణయమని చెప్పారు. టీనేజ్ ప్రతిభావంతుడు వైభవ్ సూర్యవంశీ జట్టులోకి రావడంతో పరిస్థితులు మారాయని సంజూ శాంసన్ పరోక్షంగా సూచించారు. జట్టు భవిష్యత్ ప్రణాళికలు, ఆటగాళ్ల సమీకరణల నేపథ్యంలో తాను కొత్త నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే రాజస్థాన్ రాయల్స్‌తో గడిపిన అనుబంధం, అభిమానుల ప్రేమను ఎప్పటికీ మరిచిపోలేనని స్పష్టం చేశారు. ఇక చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కొత్త ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించడమే తన లక్ష్యమని సంజూ పేర్కొన్నారు.

# ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌కు కనువిందైన ముగింపు వేడుక

న్యూయార్క్, జూలై 17 (ఉద్యమ కెరటం): ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026 తుది సమరానికి రంగం సిద్ధమైంది. అమెరికాలోని మెట్లైఫ్ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ చారిత్రాత్మక ఫైనల్‌ను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఫిఫా తొలిసారిగా భారీ ముగింపు వేడుకతో పాటు ప్రత్యేక హాఫ్‌టైమ్ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు నిర్వహించే ముగింపు వేడుకల్లో ప్రపంచ ప్రఖ్యాత సంగీత కళాకారులు లారా పౌసిని, నికోల్ షెర్జింగర్, రాబీ విలియమ్స్ తమ ప్రదర్శనలతో అలరించనున్నారు. ప్రముఖ సామాజిక మాధ్యమాల కంటెంట్ సృష్టికర్త ఐషోస్పీడ్ కూడా ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారు. హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక అతిథిగా హాజరుకానుండగా, అమెరికా జాతీయ గీతాన్ని ప్రముఖ గాయని జెన్నిఫర్ హడ్సన్ ఆలపించనున్నారు. ఫుట్‌బాల్ ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా అమెరికన్ సూపర్ బౌల్ తరహాలో హాఫ్‌టైమ్ ప్రదర్శన నిర్వహించనున్నారు. సుమారు 11 నిమిషాల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని ప్రముఖ సంగీతకారుడు క్రిస్ మార్టిన్ రూపొందించారు. ఇందులో మడోన్నా, షకీరా, జస్టిన్ బీబర్, బీటీఎస్ బృందం, బర్నా బాయ్, గుస్తావో దుదామెల్‌తో పాటు ప్రముఖ బాలల పాత్రలు కూడా సందడి చేయనున్నాయి. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఫిఫా గ్లోబల్ సిటిజన్ ఎడ్యుకేషన్ ఫండ్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వెనుకబడిన చిన్నారులకు నాణ్యమైన విద్య, ఫుట్‌బాల్ శిక్షణ అందించేందుకు 100 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. భారత కాలమానం ప్రకారం జులై 18 రాత్రి 11 గంటలకు ముగింపు వేడుకలు ప్రారంభం కానుండగా, అర్జెంటీనా--స్పెయిన్ మధ్య ప్రపంచకప్ ఫైనల్ జులై 19 తెల్లవారుజామున 12:30 గంటలకు ఆరంభం కానుంది. భారతదేశంలో ఈ మెగా ఫైనల్‌తో పాటు ముగింపు వేడుకలను టెలివిజన్, డిజిటల్ వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.








# గంభీర్, కోహ్లీ మధ్య విభేదాల్లేవు

**సితాంశు కోటక్**

**కార్డిఫ్, జులై 17 (ఉద్యమ కెరటం):** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య విభేదాలు నెలకొన్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ ఖండించారు. వారిద్దరి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, జట్టు ప్రయోజనాల కోసం ప్రతిరోజూ అనేకసార్లు పరస్పరం చర్చించుకుంటూ ఉంటారని స్పష్టం చేశారు. ఇంగ్లండ్‌తో కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డే అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్, గంభీర్, కోహ్లీ మధ్య సంబంధాలు ఎంతో స్నేహపూర్వకంగా ఉన్నాయని తెలిపారు. గురువారం ఒక్కరోజే వారిద్దరూ దాదాపు పది సార్లు మాట్లాడుకున్నారని పేర్కొన్నారు. జట్టులోని వ్యూహాలు, మ్యాచ్ పరిస్థితులు, బ్యాటింగ్‌కు సంబంధించిన అంశాలపై తరచూ చర్చలు జరుపుతుంటారని వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం బర్మింగ్‌హామ్‌లో జరిగిన భారత జట్టు సాధన సందర్భంగా గంభీర్, కోహ్లీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విభేదాలపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఆ ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని కోటక్ స్పష్టం చేశారు. కొద్దిసేపు మాట్లాడకపోవడాన్ని విభేదాలుగా చిత్రీకరించడం సరైనది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. విరాట్ కోహ్లీ భవిష్యత్‌పై కూడా కోటక్ స్పందించారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే కోహ్లీ కోరిక ఇప్పటికీ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే ఎన్నో ఘనతలు సాధించిన కోహ్లీకి నిరూపించుకోవాల్సింది ఏమీ లేకపోయినా, జట్టుకు ఉపయోగపడినంతకాలం భారత జట్టుకు సేవలందించాలనే తపనతో ఉన్నాడని చెప్పారు. ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో ఆదివారం జరిగే మూడో, చివరి వన్డేతో ఈ సిరీస్ ముగియనుంది. అనంతరం సెప్టెంబర్‌లో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో కూడా విరాట్ కోహ్లీ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు జట్టు వర్గాలు వెల్లడించాయి.

# కలెక్టర్ గారూ.. మళ్లీ రండి!

- కొత్త సూపరింటెండెంట్ వచ్చినా పాత రోగం తగ్గలేదు!
- రేపటి సంతకం ఇవాళే... ఆసిఫాబాద్ ఆసుపత్రి డాక్టర్ల 'టైమ్ ట్రావెల్'
- కలెక్టర్ వేటు వేసినా కరగని నిర్లక్ష్యం
- ప్రభుత్వ ఆసుపత్రిలో పేదల ప్రాణాలతో చెలగాటం!
- భవిష్యత్తును ముందే ఊహించిన హెచ్ఓడీ
- జూలై 17 నాడే 18వ తేదీ సంతకం!
- ఆసిఫాబాద్ జీజీహెచ్‌లో అసలేం జరుగుతోంది?



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** అది కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్). పేద రోగుల పాలిట సంజీవనిగా మారాల్సిన ఈ ఆసుపత్రి, కొందరు అధికారుల, వైద్యుల నిర్లక్ష్యంతో నవ్వులపాలవుతోంది. ఉన్నతాధికారుల హెచ్చరికలు, జిల్లా కలెక్టర్ కరడుగట్టిన చర్యలు కూడా ఇక్కడి వైద్యుల మొద్దునిద్రను వదలగొట్టలేకపోతున్నాయి. అసలు ఆసిఫాబాద్ జీజీహెచ్‌లో ఏం జరుగుతుందో చెప్పడానికి ఈ తాజా ఘటనే నిదర్శనం.

### భవిష్యత్తును ముందే ఊహించిన హెచ్ఓడీ!

క్యాలెండర్ ప్రకారం ఇవాళ జూలై 17. కానీ ఆసిఫాబాద్ ఆసుపత్రిలోని ఒక డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ కి మాత్రం ఇవాళే జూలై 18 వచ్చేసింది! విధులకు హాజరు కాకుండానే ముందస్తుగా సంతకాలు చేయడం ఇక్కడ అలవాటుగా మారిన తరుణంలో, సదరు హెచ్ఓడీ ఒక అడుగు ముందుకు వేశారు. 17వ తేదీ నాడే.. ఇంకా తెల్లవారని 18వ తేదీ హాజరు పట్టికలో తన సంతకాన్ని పక్కాగా పడేశారు. ఈ 'టైమ్ ట్రావెల్' నిర్లక్ష్యాన్ని చూసి ఆసుపత్రి సిబ్బందే ముక్కున వేలేసుకుంటున్నారు. రేపు ఆసుపత్రికి వస్తామో లేదో తెలియదు కానీ, హాజరు పట్టికలో మాత్రం సంతకం ముందే రెడీగా ఉండాలనే ఈ 'అంకితభావం' వెనుక అసలు మర్మమేంటో ఉన్నతాధికారులకే తెలియాలి.

### కలెక్టర్ వేటు వేసినా కరగని నిర్లక్ష్యం

కొద్దిరోజుల క్రితమే జిల్లా కలెక్టర్ హరిత ఈ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం, పైగా విధులకు రాకపోయినా ముందే సంతకాలు చేసి ఉండటాన్ని కలెక్టర్ స్వయంగా పట్టుకున్నారు. ఆసుపత్రి బాధ్యతలను సక్రమంగా నిర్వహించనందుకు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అప్పటి సూపరింటెండెంట్‌ను పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో ఒక సీనియర్ ప్రొఫెసర్‌ను నూతన సూపరింటెండెంట్‌గా నియమించారు. బాస్ మారితే వ్యవస్థ మారుతుందని అంతా భావించారు. కానీ, "సూపరింటెండెంట్ మారినా.. మా 'సీన్' మారదు" అన్నట్లుగా కొందరు వైద్యులు వ్యవహరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వేటు వేసినా ఇక్కడి వైద్యులలో నిర్లక్ష్యం అణుమాత్రం కూడా కరగలేదనడానికి ఈ ముందస్తు సంతకాల పర్వమే సాక్ష్యం.


### ప్రభుత్వ ఆసుపత్రిలో పేదల ప్రాణాలతో చెలగాటం!

ఈ దారుణమైన నిర్లక్ష్యం వల్ల నష్టపోతోంది మాత్రం అమాయక రోగులే. జిల్లా నలుమూలల నుండి, మారుమూల గ్రామాల నుండి వందలాది మంది గిరిజన, పేద రోగులు ప్రతిరోజూ ఈ ఆసుపత్రికి వస్తుంటారు. తీరా ఇక్కడికి వస్తే సమయానికి విధుల్లో డాక్టర్లు ఉండరు. అత్యవసర సమయాల్లో వైద్యం అందించే నాథుడే కరువవుతున్నాడు. రోగులను గంటల తరబడి వెయిటింగ్ రూమ్‌లలో నరకయాతన పెడుతున్నారు. సరైన సమయానికి వైద్యం అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రి పూర్తిగా విఫలం కావడంతో, రోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రాణాలు దక్కించుకోవడానికి వేలాది రూపాయలు అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రుల పాలు కావాల్సి వస్తోంది. సర్కారు ఉచిత వైద్యం అందిస్తున్నా, డాక్టర్ల నిర్లక్ష్యంతో పేదల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

### ఆసుపత్రి వ్యవస్థ ప్రక్షాళన కావాలి!

హాజరు పట్టికల్లో ముందస్తు సంతకాలు పెడుతూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి వైద్యులపై ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. బయోమెట్రిక్ విధానాన్ని పక్కాగా పర్యవేక్షించడంతో పాటు, విధులకు ఎగనామం పెడుతున్న వారిని సస్పెండ్ చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**కలెక్టర్ గారూ.. మీరు మళ్లీ రావాలి! ఈ ఆసుపత్రికి పట్టిన పాత రోగం తగ్గాలంటే మీరే స్వయంగా మరోసారి రంగంలోకి దిగక తప్పదు!**






# రూల్స్ బ్రేక్.. ఫీజులు షేక్!

## వాంకిడిలో పట్టించుకోని విద్యాశాఖ!

### ఫీజుల దోపిడీ.. ప్రైవేట్ పబ్లికేషన్ల 'కమిషన్' మాయాజాలం!

**ఉద్యమ కెరటం, వాంకిడి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో ప్రైవేట్ విద్యా సంస్థల అక్రమాలు రోజురోజుకూ హద్దులు దాటుతున్నాయి. నాణ్యమైన విద్య అందుతుందనే ఆశతో కన్నవారు తమ రక్తాన్ని చెమటగా మార్చి ఫీజులు చెల్లిస్తుంటే, యాజమాన్యాలు మాత్రం నిబంధనలను తుంగలో తొక్కి కాసుల వేటలో పడ్డాయి. ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం, స్థానిక విద్యాశాఖ అధికారుల ఉదాసీనత ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులకు వరంగా మారింది.

### ఫీజుల దోపిడీ.. ప్రైవేట్ పబ్లికేషన్ల 'కమిషన్' మాయాజాలం!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల తన ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలి. కానీ వాంకిడిలో ఏ ఒక్క స్కూల్లోనూ ఈ బోర్డులు కనిపించవు. ప్రభుత్వ సిలబస్ పుస్తకాలను పక్కనపెట్టి, భారీగా కమిషన్లు ఇచ్చే ప్రైవేట్ పబ్లిషర్ల పుస్తకాలను తల్లిదండ్రులపై బలవంతంగా రుద్దుతున్నారు. స్కూల్ యాజమాన్యాలు సూచించిన నిర్దిష్ట దుకాణాల్లోనే పుస్తకాలు, యూనిఫాంలు, షూస్ కొనాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. బయట మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు వీటిని అమ్ముతూ తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

### బోధనా ప్రమాణాలు కరవు.. అర్హత లేని ఉపాధ్యాయులతో క్లాసులు!

లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలు బోధనా ప్రమాణాలను మాత్రం గాలికొదిలేశాయి. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు ఉండాల్సిన కనీస విద్యార్హతలు బీ ఈ డి, డీ ఈ డి, టీ ఈ టీ లేవు. తక్కువ జీతాలకే దొరుకుతున్నారనే సాకుతో అర్హత లేని వారిని నియమించుకుని విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు.

### రవాణా భద్రత శూన్యం.. ప్రాణాలతో చెలగాటం!

విద్యార్థులను తరలించే బస్సులు, వ్యాన్లు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ లేని పాత వాహనాలు రోడ్లపై ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. వాహనాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌స్టింగిషర్, స్పీడ్ గవర్నర్లు ఎక్కడా కనిపించడం లేదు. రక్షణ కోసం మహిళా అటెండర్లను కూడా నియమించడం లేదు.

### పట్టించుకోని విద్యాశాఖ.. తక్షణమే స్పందించాలి!

మండల వ్యాప్తంగా ఇంత జరుగుతున్నా విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, రవాణా, పోలీస్, విద్యాశాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలనీ, నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపును రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలనీ, తల్లిదండ్రులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్ అందుబాటులోకి తేవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.







# సమంతకు సీమంతం



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**